"ఏమిటది?"

"చూస్తున్నారు కదా. అడగడం దేనికి?"

"చూస్తున్నాను కాబట్టే అడుగుతున్నాను అది ఏమిటీ అని."

"అది ఒక కవరు."

"ఆహా తెలివి. ఆపాటి నాకూ తెలియక్కాదు. అదే....అందులో వున్నది ఎవరికి?"

"...................."

"అయితే చెప్పవన్నమాట."

"ఎందుకు చెప్పను? మీకు చెప్పకుండా ఎప్పుడైనా ఏదైనా దాచేనా?"

"అయితే చెప్పడానికింత ఆలస్యం ఎందుకు? ఎవరికి వ్రాసేవో, ఏమిటో చెప్పి ఏడవకూడదూ?"

"అలాగే చెప్తాను. కాని 'అందులో ఏమిటుంటే మనకెందుకు పోనీలెద్దూ' అని వూరుకోకూడదూ!"


"ఎందుకు వూరుకోవాలి? నువ్వు మహా వూరుకుంటున్నావేమిటి? అన్నింటినీ లాగుతావు. చెప్పిందాకా ప్రాణం తోడతావు. నీదైతే నాకు అంతయిదా....వూ....అయితే నీక్కూడా రహస్యాలున్నాయన్నమాట. 'నేనెప్పుడూ ఏదీ దాచను. ఏది మనసులో వున్నా మీతో చెప్పిందాకా తోచదు' అంటూ గొప్పలు చెప్తావు. అవన్నీ చెప్పడం వరకే. అక్కడికి నేనే ఏదో దాస్తున్నట్టు. తనదాకా వస్తేగాని...."

అసలే తలనొప్పితో యింటికొచ్చిన శర్మకి రేవతి ప్రవర్తన నిజంగా విసుగు కలిగించింది.

"అబ్బ! ఎందుకండీ, అంత చిన్న విషయాన్ని పట్టుకుని అలా సాగదీస్తారు? సరే చెప్తాను వినండి. అది మా అమ్మవాళ్ళకి వ్రాసేను" అన్నది. రేవతి మాటలకి కోపం, నవ్వూ కూడా వచ్చేయి శర్మకి.

"ఆహా....ఏం జోకువేసేవు. మీ అమ్మ వాళ్ళకి నువ్వు కవర్లో వుత్తరం వ్రాయడం కూడానా? పదిహేను పైసల కార్డులో అర్ధరూపాయి మేటరు యిరికిస్తావు. అలాంటిది నువ్వు చెప్తే మాత్రం నేను నమ్ముతాననుకున్నావా? పోనీ చెప్పకు. దాచుకో. నీ చేత ఎలా చెప్పించాలో నాకు బాగా తెల్సు." విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయేడు శర్మ.

"ఎలా చెప్పించాలో నాకుతెల్సు" అన్న



# ఇదొక రకం పిచ్చి

— శ్రీమతి న్యాయపతి వెంకటాచలం

ఆఖరి మాట వినగానే రేవతికి నిజంగా భయం వేసింది. 'ఏంచేస్తారో! ఏమో! తర్వాతేంచేసినా ముందు మాట్లాడడం మానేస్తారు. అదే ఆయనతో వచ్చిన చిక్కు. పోనీ చెప్పేస్తే....అమ్మో....అది అసలు ఎవ్వరికీ తెలియకూడదనికదా అంత జాగ్రత్తగా ఎవ్వరూ లేని సమయంలో కవర్లోపెట్టి అంటించి, 'గబగబా పోస్టులో వేసిరావే' అని చెప్పి వెంకమ్మకిచ్చింది. తన ఖర్మ కాకపోతే సరిగ్గా ఆది గుమ్మం దిగుతున్న టైముకే ఆయన ఇంట్లోకిరావాలా? తనకి తలనొప్పి ఈ వేళప్పుడే రావాలా?'....అనుకుంది రేవతి. శర్మ తలనొప్పి మాట దేవుడెరుగుగాని ఇప్పుడు తనకి తలనొప్పి పట్టుకుంది. శర్మ మౌనంగా వుండే సాధిస్తాడని రేవతికి బాగా తెల్సు. అయినా చెప్పకూడదనుకుంది.

లేచి వెళ్ళి టిఫిన్, కాఫీ చేసింది. తినడానికి రమ్మని పిలిచింది. అంతసేపూ వీధిగదిలో

ఈజీచైర్‌లో పడుకున్నవాడల్లా గబుక్కున లేచి 'అదంతా నువ్వేతిను' అని కోపంగా అనేసి గబగబా చెప్పులు వేసుకుని అవతలికి వెళ్ళిపోయేడు శర్మ. రేవతికి చాలా కష్టమనిపించింది. శర్మ తినకుండా తనూ తినడానికి మనసొప్పలేదు. అదంతా మూతపెట్టి వచ్చేసింది పిల్లలొస్తే తింటారని. ఇహ సాయంత్రం ఎన్ని గంటలకు వస్తారో?, ఒక్క నిముషం ఆలస్యం అయితే కూడా తను భరించలేదు. అలాంటిది ఈరోజు తనమీద కోపం కొద్దీ ఇవాళ యింటికి రాకుండా ఏ బార్‌కో వెళ్ళిపోయి....అక్కడినుంచి....యిహ తల్చుకునేందుకు కూడా భయం వేసింది.

'భగవాన్! యింత చిన్న కోరిక కూడా తీర్చలేకపోతున్నావా నువ్వు? ఏ జన్మలో చేసుకున్న పాపమో ఇది. అది చెప్పకపోవాలని కాదు. దాచాలనే ఉద్దేశం అంతకంటే కాదు. నిజానికి ఆయన దగ్గర దాచవల్సిన రహస్యాలేవీలేవు. కాని యిది....యిది మాత్రం చెప్పకూడదు. చెప్పలేను. ఇప్పుడప్పుడే చెప్పను. ఒకవేళ అవమానం జరిగినా అది నాలోనే వుండిపోవాలి. అది ఆయనకి తెలియకూడదు. నాకు జరిగిన అవమానాన్ని తను ఎత్తి చూపిస్తే మరింత బాధగా వుంటుంది. తనూ హేళన చేస్తారు. నవ్వుతారు. వెక్కిరిస్తారు. అది చాలక పదిమందితోనూ చెప్పి మరీ నవ్వుతారు. మొగుడు కొట్టాడన్న బాధకన్నా, తోడికోడలు నవ్విందన్న బాధ ఎక్కువ అన్నట్లవుతుంది' అనుకుంది రేవతి. ఎవరైనా తనని చిన్న మాటంటే చాలు జీవితాంతం తల్చుకుని బాధపడుతుంది.

శర్మ ఆఫీసుకి వెళ్ళాడన్న మాటేగాని పని సరిగ్గా చేయలేకపోయేడు. కోపంలో కాఫీ కూడా తాగకుండా వచ్చేయడంతో తలనొప్పి మరింత ఎక్కువైనట్టు అనిపించింది. 'రేవతి ఆ కవరు ఎవరికి వ్రాసివుంటుంది? ....వాళ్ళ అమ్మవాళ్ళకు కాదు. మరెవరున్నారు? ఏమో తనకెవరున్నారో నాకేం తెలుస్తుంది? అయినా ఎప్పట్నుంచి వ్రాస్తున్నదో — చాటుమాటుగా ఇవాళ నా కంట పడింది. పెళ్ళికిముందే ఏదో ప్రేమ వ్యవహారం వుండి వుంటుంది. ఇప్పటికీ అది కంటిన్యూ అవుతోంది కాబోలు. ఛీ....ఛీ! ఎంత సిగ్గులేదు! ఎంత చెప్పమన్నా చెప్పలేదు. ఏ రహస్యమూ లేకపోతే చెప్పడానికంత భయందేనికి? ఆ టైముకి తోచలేదుకాని గబగబా వెళ్ళి వెంకమ్మ చేతిలోంచి ఆ కవరు లాగేసి అడ్రసు చూడవల్సింది. తప్పు చేసేను, ఇప్పుడనుకుని లాభం ఏమిటి? అయినా ఎంత బుర్ర తిరుగుడు! దానికి యిలాకాదు. వాళ్ళ నాన్నగార్ని రమ్మని వుత్తరం వ్రాస్తాను. ఆయన వస్తే ఆయన ముందే అడుగుతాను. లేకపోతే ఆయనచేతే అడిగిస్తాను. ఎలా చెప్పదో చూస్తాను. ఆడవాళ్ళు పైకి అమాయకంగా కనిపిస్తుంటారు. కాని అబ్బ- వాళ్ళకెన్ని రహస్యాలు'....అనుకున్నాడు. జరిగిందంతా వివరిస్తూ మావగార్ని రమ్మని వుత్తరం వ్రాసి పోస్టు చేయించేసరికి మనసు కొంచెం తేలికయినట్టనిపించింది శర్మకి.

ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చిన శర్మ మాట్లాడకుండానే భోజనం చేసి పడుకున్నాడు. ఆమర్నాడు కూడా యిద్దరి మధ్యా మాటలు లేవు. మూడోనాడు హఠాత్తుగా ఊడిపడిన రంగారావుని చూసి ఆశ్చర్యపోయింది రేవతి. "ఏమిటి నాన్నా! వచ్చేముందు వుత్తరం అయినా వ్రాసేరుకారు" అంది.

రంగారావు తను ఎందుకు వచ్చాడో ఏమిటో అంతా చెప్పి నాలుగు చీవాట్లు పెట్టాడు. అంతా విన్న రేవతి అవాక్కయింది. ఆ కవరు గురించి భర్త అంత సీరియస్‌గా తీసుకుంటాడని తను అనుకోలేదు. మహా మొండి మనిషి! ఇప్పుడేం దారి? ఇప్పటికీ తను చెప్పకపోతే?....ఖచ్చితంగా "మీనాన్న వెంట మీవాళ్ళింటికి వెళ్ళిపో. మరీ రాకు ఇక్కడికి" అంటారు. శర్మ అలాంటివాడే! ఇహ తనకి చెప్పక తప్పదు. గబగబా శర్మ దగ్గరకి వెళ్ళింది. రేవతి వచ్చినట్లు గమనించినా ఏమీ ఎరగనట్లే పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. దగ్గరగా వెళ్ళి "ఏమండీ" అని పిలిచింది.

'ఊఁ' అన్నాడేగాని తల ఎత్తలేదు శర్మ.

"దాని గురించి అంతరాద్ధాంతం చేసి మానాన్నగార్ని పిలవడం ఎందుకండీ?"

"నేను రాద్ధాంతం చేస్తున్నానా? నువ్వు చేస్తున్నావా? అడిగితే వెంటనే జవాబు చెప్పాలని నీకామాత్రం తెలీదూ? భార్యాభర్తల మధ్య రహస్యాలుండకూడదని నువ్వే పెద్దగా నా దగ్గర లెక్చర్లు దంచుతావు. మరి యిప్పుడు రహస్యాలు ఎవరికున్నాయో!"

"అది....ఆ కవర్లో వున్నది....ఒక చిన్న కథ! 'ఇదొక పెద్ద రహస్యమా!' అనగలరు. కాని అదే మీకుచెప్తే 'ఇది రెండువందల ఒకటోసారా లేక నాలుగువందల నాలుగోసారా' అని అడుగుతారు. వెక్కిరిస్తారు. లేకపోతే కవరు ఖర్చులు దండుగ అంటారు. అదీకాక నేను ఎంత బాగా వ్రాసినా ఏదో ఒకవంక పెడ్తారు. 'అది బాగులేదు, అది బాగులేదు. ఇది చింపేసి మరోటి వ్రాయి' అంటారు.

"'నీకూ, నాకూ కథలేమిటిలెద్దూ. వాళ్ళు ఇవన్నీ చదువుతారనుకున్నావా? ఏ చెత్త బుట్టలోనో తోస్తారు. నీకు టైము వేస్టు, ఎనర్జీ వేస్టు, మనీ వేస్టు,' అంటారు. ఇలా అంటారని తెలిసే మీతో చెప్పడం మానుకున్నాను. మీరలాగ అంటే నాకెంతో బాధగా వుంటుంది. కాని నాకు యిదొక పిచ్చి! ఒక్కటి కూడా పడకపోయినా, వ్రాత మానలేదు. పంపడం అంతకంటె మానలేదు. ఇప్పటికి ఎన్నో కవర్లు ఇలాంటి వెళ్ళేయి నా చేతుల్లోంచి! కాని ఒక్కటీ మీకు తెలీదు. ఎందుకో తెలుసా? ఎక్‌నాలెడ్జిమెంటు పెట్టను. స్టాంపులతో కూడిన కవరు జతపర్చను. ఈ రెండూ చేస్తే అది ఎలాగో తిరిగొచ్చేస్తుంది. అప్పుడు మరింత స్పష్టంగా అవమానం అందరి కళ్ళల్లో పడుతుంది. అది నేను భరించలేను. 'నేను పంపేను. పడలేదు,' అని నా ఒక్కర్తికే తెలిస్తే ఫర్వాలేదు. అది ఇతరులకు....ముఖ్యంగా మీకు తెలియకూడదు. అందుకే ముందు మీరు ఎంత అడిగినా చెప్పలేదు. దానికి మీరు ఇంత రాద్ధాంతం చేసేరు." అప్పటిదాకా ఆపుకున్న దుఃఖం ఒక్కసారిగా పైకుబికింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోబోతూంటే శర్మ గబుక్కున కొంగు పట్టుకుని లాగి తనవైపుకి తిప్పుకుని రేవతిని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు.

"నువ్వు నిజంగా పిచ్చిదానివి. మనిషికొక రకం పిచ్చి, అలా అయితే నేనూ పిచ్చివాడినే. ఎందుకంటావా? నేను చూడు, నెలకి ఎన్ని లాటరీ టిక్కట్లు కొంటున్నానో? ఒక్కటైనా వచ్చేదేస్తోందా? అయినా కొనడం మానేస్తున్నానా? లేదే. అది అంతే. నాకు లాటరీ టిక్కట్లపిచ్చి. నీకు కథలపిచ్చి. అయినా నా లాటరీ టిక్కట్లకయ్యే డబ్బుకంటె ఎక్కువేం అవదులే నీ కవర్లకయ్యే ఖర్చు. ఆమాత్రం దానికోసం, అదొక 'పెద్ద రహస్యం'లాగ దాచుకుంటే నేను యింకా ఏమిటో అని అపోహపడ్డాను."

అసలు సంగతి అర్థం కాని రంగారావు "వాళ్ళిద్దరూ గదిలో దెబ్బలాడుకుంటున్నారు కాబోలు" అని అటూఇటూ తచ్చాడుతున్నాడు. □